కథ

# వనజాక్షి-వరదగోదారి

డా॥ మానేపల్లి

వరదరాజు కూతురు చచ్చిపోయింది. వనజాక్షి డిగ్రీ చదువుతూ- చదువు మానేసింది. రేడియోల్లో పాటలు పాడింది. బృందగానం. శ్రవ్య నాటకాల్లో నటించింది. ఒకసారి కన్యాశుల్కం ట్రూపులో చేరి బుచ్చమ్మ పోర్షన్ వేసింది. రావిశాస్త్రిగారి నిజం నాటకంలోనూ ఒక పాత్ర వేసింది. అంతా ఇరవై ఏళ్ళ వయస్సులోనే వరదరాజుకి వనజాక్షి చెయ్యి దాటిపోతుందేమోనని భయమేసింది. పెళ్ళి చేశాడు. చేతయినంతలో ఘనంగా చేశాడు. అల్లుడు టీవీ మెకానిక్. బుద్ధిమంతుడు. బాగా మెతక మనిషి. ఈ కాలపు కుర్రాళ్ళలా కాదు. కట్టుకున్న పెళ్ళాన్ని కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాడు. సినిమాలు చూడడు, సిగరెట్లు కాల్చడు. మందు ఎలా వుంటుందో కూడా తెలీదు. పేకాట కూడా ఆడడు. స్నేహితులు లేరనే చెప్పాలి. ఉన్న ఒకరిద్దరూ - చిన్నప్పట్నించీ కలిసి చదువుకున్న బాల్య స్నేహితులు. వాళ్ళకీ పెళ్ళిళ్ళలయ్యాయి. సంసారాలు చేసుకుంటూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఉద్యోగాలు చేసుకుంటూ నింపాదిగా బ్రతుకు గడిపేస్తున్నారు. వనజాక్షి మొగుడు వీరాచారి మంచి బాలుడు. అతని తండ్రిది బంగారపు పని. పెద్దలు యిచ్చిన పెంకుటిల్లుంది. తిండికీ బట్టకీ లోటు లేదు. పరువుగా బ్రతుకుతున్న కుటుంబం. వీరాచారి అక్క బతుకు సరి లేదు. మొగుడు వదిలేశాడు. సూర్యాకాంతం నడత మంచిది కాదని కాస్త మగవాళ్ళతో తిరుగుతుంటుందనీ- అందుకే మొగుడొదిలేశాడనీ అంటారు. వనజాక్షికి సూర్యకాంతం గురువు. వయసులో వున్న మగవాడు కనపడితే - చంద్రుణ్ణి చూసిన సముద్రంలాగ - మనసు ఉరకలు వేస్తుంది. వయసులో కోరికలు సహజం. ఆ పనే మగవాడు చేస్తే తప్పు పట్టరు. ఆడది చేస్తేనే ఆరడి చేస్తారు.

వరదరాజు కూతురు వనజాక్షి చచ్చిపోయింది.

తొలిచూలు మగపిల్లాడు. వాడు బరంపురంలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లాం ఇద్దరు పిల్లల్తో పరువుగా బ్రతుకుతున్నాడు. రెండోకాన్పు వనజాక్షి. మూడు - ఇంకో కూతురు. ఈ మధ్యనే పెళ్ళి చేశాడు. మొగుడు దుబాయ్‌లో ఉద్యోగం. రేపు సెలవలకి వస్తే పెళ్ళాన్ని కూడా తీసుకుపోతానంటున్నాడు. ఈ దేశం కాదు - ఎన్నాళ్ళకి మళ్ళీ, కూతుర్ని కళ్ళ జూస్తానో లేదోనని తల్లి కళ్ళనీల్లు పెట్టు కుంటున్నది. ఏడిస్తే సమస్యలు తీరిపోతాయా? ఎలా జరగ వలసింది అలా జరుగుతుంది. మన చేతుల్లో ఏముంది గనుక?! వరదరాజు దైవభక్తుడే కాని, కాస్త హేతువాది. సమాజంలో అంతటా ఏది జరిగితే అదే మనకీ జరుగుతుంది. మన చేతుల్లో లేదంటే అర్థం - సమాజం నడకకి మనం ఎదురు వెళ్ళలేం కదా? అదే కర్మ- అదే దేవుడు. ఏదయినా మన చుట్టూ ఉండే కుటుంబంలోనూ, సమాజంలోనూ లేనిది మనకు జరగదు కదా. అదీ వరదరాజు వాదన.

ఏమయితే ఏం చెయ్యగలం? వరదరాజు కూతురు వనజాక్షి చచ్చిపోయింది. రాజమండ్రిలో చచ్చిపోయింది. ఆత్మహత్యన్నారు. కాదు హత్యేనన్నారు. మొగుడు ఊళ్ళో లేడు. వనజాక్షికి రెండేళ్ళు నిండిన కూతురుంది. సువర్ణ. నిజంగా సువర్ణమే. అపరంజి బొమ్మ. ఇంట్లో అంతా ఆ పిల్లని లక్ష్మి అనే పిలుస్తారు. బంగారు లక్ష్మి అని మహా ముద్దుగా పిలుస్తారు. అందరికీ చాలా గారాబం. సువర్ణ తల్లి లేని పిల్లయ్యింది. మొగుడు వీరాచారి చాలా చాలా మంచివాడు. పెళ్ళాం ఎంత చెబితే అంత. జ్యూయలరీ షాపులో పని. సంపాదన తెచ్చి భార్యకే ఇస్తాడు.

వనజాక్షిలో కళ వుంది. మంచిగాత్రం. రూపరేఖా లావణ్యాలు బాగుంటాయి. ఆంగికం వాచకం బాగుంటాయి. నటనారంగంలో రాణించింది. టీవీ సీరియల్‌లో ఛాన్సొచ్చింది. హైదరాబాద్ ప్రయాణాలు మొగుడు అడ్డుపెట్టలేదు "వైకుంఠపాళి" సినిమాలో హీరో చెల్లెలుగా వేసింది. చందమామ, చదరంగం సినిమాల్లోనూ నటించింది. "అదృష్ట రేఖ" సినిమాలో హీరోయిన్ ఛాన్సొచ్చింది. పెళ్ళాం హీరోయిన్ అయినందుకు వీరాచారి సంతోషించాడు. అడ్డు పెట్టలేదు. మరి ఆ ఫీల్డు అలాంటిది. మగవాళ్ళతో తిరుగుతుంది. తాగుతుంది. గంతులేస్తుంది. అదీ డాన్సు చేస్తుంది. మరి చెయ్యకపోతే ఎలా? పుష్కలంగా డబ్బు తెస్తుంది. వరదరాజు ఏమంటాడు. తల్లి ఏం చెయ్యగలదు. కూతురు చెయ్యిదాటిపోయిందని మాత్రం వరదరాజుకి పూర్తిగా తెలిసిపోయింది. ఇక ఏం చేసీ లాభం లేదు. ఏం సినిమాల్లోనూ టీవీల్లోనూ ఎందరు పనిచెయ్యడం లేదు ఈ రోజుల్లో. అంతమాత్రాన చెడిపోయిందనుకోవాలా? అయినా మగవారి ప్రమేయం లేనిదే ఆడది ఎలా చెడుతుంది.

ఆడబడుచు సూర్యాకాంతానికి సుడి తిరిగింది. వనజాక్షి వెంట షూటింగ్‌లకు తిరుగుతుంది. అయితే ఫీల్డుకి పనికి రాదు- ఏ కోణంలో చూసినా. ఐతే సరదాలు తీర్చుకునేందుకు లోటు లేదు. షూటింగ్ రోజుకో ఊరు. పూటకో పురుషుడు.

వరదరాజు కూతురు వనజాక్షి చచ్చిపోయింది. టీవీలో చూసి తెలుసుకున్నాడు. తల్లి నిలువునా కూలిపోయింది. వెంటనే టాక్సీ కట్టుకుని రాజమండ్రి వెళ్ళారు. కోనసీమలో షూటింగ్. రోజూ కార్లమీద సినిమా ట్రూపు బయల్దేరుతుంది. రాత్రికి లాడ్జింగ్‌కి చేరుకుంటారు. రాజమండ్రి పుష్కరాల రేవులోనూ కొన్ని సీన్లు తీశారు. ధవళేశ్వరం ఆనకట్ట దగ్గర ఒక పాటలో ఒక చరణం తీశారు. హీరో కిరణ్‌కుమార్ పేరున్నవాడే. నాలుగేళ్ళుగా నటిస్తున్నాడు. పాతకాలపు కేరక్టర్ యాక్టరు కృష్ణమూర్తికి దత్తుడు. పది సినిమాల్లో వేశాడు. "ప్రేమా పెళ్ళి" సినిమా హిట్టయ్యింది. అందులో హీరో కిరణ్‌కుమారే. ప్రస్తుతం అరవై లక్షలు పుచ్చుకుంటున్నాడు. ఇకపై దాన్ని కోటి రూపాయలు చెయ్యాలన్న ఆలోచన వచ్చింది. గాని - గాడ్ ఫాదర్ కృష్ణమూర్తి ఆగరా కొడకా అని ఆపాడు. సినిమా ఫీల్డు మాకంతిరీ ఫీల్డు. తిమింగలాలుంటాయి. కాస్త కాసుకోవాలి. చిన్న చితకా చాలా వేషాలు వేశాడు. ఇప్పుడిప్పుడే పైకొస్తున్నాడు. ముప్పయ్యేళ్ళు దాటాయి. హీరోయిన్లూ మంచి బరిమీదున్న ఎక్స్‌ట్రాలూ ఉండగా- పెళ్ళితో పనేమిటి? చుట్టూ కావలసినంత పాలు, పెరుగూ, వెన్నా, నెయ్యీ, పాడి పంట ఉండగా మళ్ళీ గేదెని మెడకి తగిలించుకోవడం ఏల? పేడకుప్ప ఫలితం శూన్యం. ఏం వుంటుంది? అంచేత అది హీరోగారి తీరీ. "మల్లెపూలు - చెల్లి పెళ్ళి" సినిమాలో సెకండ్ హీరోయిన్ వేసిన సునయన- "ప్రేమించకు- పెళ్ళి చేసుకో"లో హీరోయిన్ ఛాన్స్ వచ్చింది. ఆ సినిమాలో కిరణ్‌కుమార్ సైడ్ హీరో-తోడ పెళ్ళి కొడుకన్న మాట. అతన్ని ప్రేమించి వైజాగ్ బీచ్‌లో ఒక పాటా, మైసూర్ బృందావన్ గార్డెన్స్‌లో ఒక పాటా తరువాత. ఫైటింగ్ విలన్ తన ట్రూప్‌తో ఎంట్రీ ఇస్తాడు. అక్కడ హీరో ప్రవేశిస్తాడు హీరోతో ఒకపాట. తరువాత ఇంటర్వెల్ తరువాత మరో రెండు పాటలు. హెలికాప్టర్ ఫైటింగ్ విలన్ మరణం కథ సుఖాంతం. ఇందులో సునయన బెస్ట్ ఫ్రెండ్‌గా వనజాక్షి నటించింది. దానికి బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా నంది ఎవార్డు కూడా వచ్చింది. దాంతో వనజాక్షికి అదృష్టం ఎదురొచ్చి హీరోయిన్ ఛాన్సొచ్చింది. ఆ సినిమా "అదృష్ట రేఖ" బాగా వచ్చింది. ఒక పావలా వంతు షూటింగ్ మిగిలి ఉంది. అది పూర్తి చేసి - పాచ్‌వర్క్, కొంత డబ్బింగ్, సెన్సార్ ముగించుకుని దసరాకి రిలీజ్ చెయ్యాలని దర్శక నిర్మాత దారబందాల దుర్యోధనరావు ప్లాను. అతగాడు ఫీల్డులోకి రాకముందు సుమారు రెండేళ్ళు ఏలూర్లో ఒక ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా చేశాడు. ఇప్పుడు అది గుర్తుంచుకుని - డిడిరావ్ గార్ని - ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజమండ్రిలో సన్మానం చేస్తారు. ఉత్తమ అధ్యాపక బిరుదు - భారీ కార్యక్రమం. గోదావరి స్టేషన్ దగ్గర ఆనం కళాకేంద్రంలో సినీ - రాజకీయ - విద్యారంగ ప్రముఖులంతా చేరారు. ఆ మర్నాడే వనజాక్షి ఉదంతం. పడవలరేవు దాటాక వరద గోదావరిలో వనజాక్షి శవమై తేలింది. పీకకీ లాంచీ లంగరుకీ ఒక తాడు - కొసన ఒక చీర - గొంతు చుట్టూ చీరముడి - ఛాతీమీద, నడుంమీద, ఎడం జబ్బమీద మూడు గాయాలు. హత్యా? ఆత్మహత్యా? ఆత్మహత్యయితే గాయాలు ఎలా వచ్చాయి? కిరణ్‌కుమార్‌కీ వనజాక్షి గత కొన్నాళ్ళుగా గొడవలు జరుగుతున్నాయనీ, ఒక బాలీవుడ్ హీరోతో తిరుగుతూ- కిరణ్‌కుమార్‌ని దరిచేరనివ్వడం లేదని- నూతన ప్రేయసి సునయన ప్రోద్బలంతో ముందే వేసుకున్న ప్లాను ప్రకారం ఇదంతా జరిగిందనీ ఇండస్ట్రీలో టాక్ గుప్పుమంది. నిజానికి అదృష్టరేఖ సినిమాలో హీరో తనని తిరస్కరించిన కారణంగా ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంది. హీరో సకాలంలో కాపాడి ఆమె ప్రేమ ఎంత తీవ్రమయిందో గాఢంగా అర్థం చేసుకుని - తల్లిదండ్రుల్నీ, మరొక దుర్మార్గుడయిన విలన్‌ని ఎదిరించి - ప్రేయసిని పెళ్ళాడతాడు. కాటూరి జానకి రామమూర్తి, కొనకళ్ళ భరణి రాసిన పాటలు ఆడియో క్యాసెట్ హిట్టయ్యింది. నటీనటులు దర్శక - నిర్మాతలు ఈ సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్నారు.

పోలీసులు రంగ ప్రవేశం చేసి వరద గోదావరి ఎర్రనీటిలో ఎర్రని రక్తపు దాగుల మధ్య వనజాక్షి శవాన్ని బయటికి తీసి - పోస్టుమార్టమ్‌కి పంపారు. కిరణ్‌కుమార్ వేలిముద్రలు, వనజాక్షి లంగామీదా, జాకెట్టుముందుభాగం మీదా ఉండడం గుర్తించి పోలీసులు హీరో కిరణ్‌కుమార్‌ని అరెస్టు చేశారు. తన పేరు ఎక్కడ బయటకొస్తుందోనని సునయన గుడివాడ పుట్టింటికి చెక్కేసింది. తల్లికి సీరియస్‌గా ఉందని ఫోనొచ్చిందని చెప్పిండి డిడిరావ్ బెయిలిచ్చి హీరోని బయటికి తెచ్చాడు.

వరదరాజుకి - పోలీసులు పోస్టుమార్టం అనంతరం వనజాక్షి శవాన్ని అప్పగించారు. మూడు రోజులుగా మీడియా వాళ్ళకి చేతినిండా పనే పని. టీవీఛానళ్ళు, పేపర్లు, ముఖ్యంగా సినిమా పేపర్లు - స్పెషల్ కవర్ స్టోరీ - ప్రత్యక్ష కథనం - లైవ్ టెలికాస్ట్. సాక్ష్యాలు బలంగా ఉండడంతో కిరణ్‌కుమార్ మీద కేసు కట్టారు. సునయనని కూడా





240 పేజీలు
వెల : రు॥ 150 /- లు

**నండూరి రాజగోపాల్**

**"అనంతరంగాలు"**

**సాహిత్య పరామర్శ**

**23-11-2008 న విజయవాడలో ఆవిష్కరణ జరిగింది.**

ఈ పుస్తకం కావలసినవారు రు॥ 100/-లు ఎం.ఓ.ద్వారా పంపించగలరు. పోస్టేజి ఉచితం.

మేనేజర్, చినుకు ప్రచురణలు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003. ✆ 0866-6640595, సెల్ : 98481 32208

రేపో నేడో అరెస్టు చేస్తారు.

వరదరాజులు పెద్ద కూతురు వనజాక్షి చచ్చిపోయి వారం రోజులయ్యింది. పది రోజులయ్యింది. పదిహేను రోజులయ్యింది. నెల్లాళ్ళయ్యింది. దసరా మర్నాడు "అదృష్టరేఖ" సినిమా విడుదలయ్యింది. రిలీజయిన చోటల్లా రికార్డు కలెక్షన్లు. ఇసుక వేస్తే రాలని జనం.

వరద గోదాట్లో శవమై తేలిన వనజాక్షిది ఆత్మహత్యా? హత్యా? అంటూ ఒక పుస్తకం వెలువడింది. రచయిత కాటూరి జానకి రామమూర్తి. పుస్తకం పాతిక రూపాయలు. కవర్ ఫొటోలు సినిమా రంగ ప్రముఖుల నివాళులు – ఓహ్ యమ సేల్స్. బెస్ట్ సెల్లర్.

తల్లి బెంగ పెట్టుకుంది. నిత్యం కూతురే కల్లోకొస్తుంది. సినిమా రంగం ఇంత దుర్మార్గంగా భయంకరంగా ఉంటుందని ఎవరూ కలలో కూడా అనుకోలేదు. సూర్యాకాంతం డీలా పడిపోయింది. తనని ఎవరు షూటింగ్‌లకి తీసుకెళ్తారు? పార్టీలూ, లాడ్జీలు, బీచ్ షికార్లు ఇక సరి. ఫుల్‌స్టాప్. సూర్యకాంతం పొడవుగా వుంటుంది. ఫరవాలేదు. కాని గొంతు బాగోదు. ఆ ముఖంలో ఏవిధమైన భావాలు వలవేసినా దొరకవు. ఆడ విలన్‌కి ఒకటి రెండుసార్లు డబ్బింగ్ యిచ్చింది కాని – తీరా సినిమా ప్రింటులు తీసేటప్పుడు తొలగించారు. మరొకరిచేత చెప్పించారు. డిడిరావ్‌కి గొప్ప డైరెక్టర్‌గా మంచి ఛాన్సులొస్తున్నాయి. "అదృష్టరేఖ" వంద రోజులు గ్యారంటీ అని సినీ పండితులు జోస్యం చెబుతున్నారు. కలక్షన్స్‌తో రికార్డులు బద్దలయిపోతున్నాయి.

ఎవరి కర్మవారనుభవిస్తారా? ఎవరు తీసిన గోతిలో వారే పడతారా? ఒకరి దుర్మార్గానికి మరొకరు గురికారా? ఒకడు తీసిన గోతిలో మరొక అమాయకుడు, అక్కుపక్షి, నోరులేనివాడు పడడూ? పడతాడు. ఎవరి కర్మ వారు అనుభవిస్తే కావల్సిందేముంది? అన్యాయం జయిస్తుంది. న్యాయం నోరు పెగలదు. ఒక దుర్మార్గాన్ని, పాపపు పనిని. ఇది తప్పు అని నిరూపించడానికి చాలా చాలా కష్టపడాలి. దేవుడూ, పోలీసులు, గవర్నమెంటు దేనికి వున్నట్టు?! మంచి చెడ్డలు పాపపుణ్యాలు నిర్ణయించ డానికి నువ్వెంత నీ బ్రతుకెంత? వనజాక్షి తల్లికి పిచ్చి పట్టలేదు, పీడకళ వచ్చింది. మనుమరాలు సువర్ణ మాత్రం దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతున్నది. రేపు నవంబర్‌లో మూడో పుట్టినరోజు. లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా అని మహాకవి గురజాడ ఊరికే అనలేదు.

మహాకవి వాక్కు వట్టిపోదు, బీరుపోదు.

వీరాచారి పనిచేస్తున్నాడు. తీరుబడి లేకుండా పని చేస్తున్నాడు. టీవీలు, టేపు రికార్డర్లు, గ్రైండర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు–అన్నీ చేస్తున్నాడు. డబ్బు సంపాదన కంటే – మనశ్శాంతి ముఖ్యం. వనజాక్షి రేడియోల్లో, టీవీల్లో సినిమాల్లో పనిచేసింది. డాన్సులు చేసింది. మగవాళ్ళతో తిరిగింది. మంచి నటిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా పనిచేసింది. సుమారు పదిలక్షల దాకా బ్యాంకులో ఉన్నాయి. కూతురు సువర్ణ పేర ఐదు లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. ఇప్పుడిప్పుడే ఫీల్డులో బిజీ అవుతుంది. ఎంత తిరిగినా మొగుణ్ణీ కూతుర్నీ అభిమానించింది. తల్లినీ తండ్రినీ, అన్న, వదిన, చెల్లి – అందర్నీ బాగా చూసుకుంది. కుటుంబ జీవితాన్ని గాఢంగా ప్రేమించింది. ఎంత సినీ ఫీల్డులో ఉన్నా మడిగట్టుకోకపోయినా తామరాకు మీద నీటిబొట్టులా ఉండిపోయింది. మలినం మనసులో ఏ కోశానా లేదు. ఏది చేసినా అది వృత్తి ధర్మంగా చేసింది. కిరణ్‌కుమార్ లాంటివాళ్ళే ఎక్కువ ఈ లోకంలో. ప్రేమ అబద్ధం. వాంఛ నిజం. శృంగారం ఒక్కటే సత్యం. మనసులు కలవడం అబద్ధం శరీరాలు కలవడం నిజం కిరణ్‌కుమార్ వల్ల గర్భం వచ్చి – అబార్షన్ చేయించుకుంది. వీరాచారి ఇంటర్మీడియెట్ మాత్రం పాసయ్యాడు ఆ తరువాత చిల్లర పనులు చేశాడు. కొన్నాళ్ళు టైలరింగ్ చేశాడు. ఇప్పటికీ ఇంట్లో ఉన్న రోజుల్లో టైలరింగ్ చేస్తూనే ఉంటాడు. ఇంటి అవసరాలకు బయటికి వెళ్ళక్కరలేదు. తీరుబడిగా వుండడు. పనిలోనే మానసిక విశ్రాంతి. వనజాక్షి సంగతి సంపూర్ణంగా తెలుసు. ఆమెని ఆమె లోపాలతో సహా నిండుగా ప్రేమించాడు. అలాగే ప్రేమించాలి. "తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు" గురివిందలా బ్రతకడం తగదు. వీరాచారి మర్చిపోలేకపోతున్నాడు. ఎలా మర్చిపోవడం. కొన్ని కొన్ని పనులు సాధ్యంకాదు. కూతురు సువర్ణ ముమ్మూర్తులా తల్లి. ఏనాడూ వనజాక్షి అబద్ధం ఆడి ఎరుగదు. దొంగతనం అంటే కిట్టదు. వీరాచారి వదిన వుంది. అన్నీ సద్గుణాలూ ఉన్న బహు పతివ్రత. తిరుగుడు, చిల్లర దొంగ తనాలు–ఇంట్లో ఇంట్లోనే తండ్రి, అన్న, మొగుడు, జేబుల్లో డబ్బులు పోతుంటాయి. సూర్యకాంతమూ అంతే. వనజాక్షి నిజమైన అర్థంలో పతివ్రత.

నిక్కమైన మంచినీల మొక్కటే చాలు
తళుకు బెళుకురాళ్లు తట్టడేల?

–అదీ మాట, వేమన్న మహానుభావుడు.

వీరాచారి పెద్దగా చదువుకున్నవాడు కాదు. కాని చదువు మీద గౌరవం ఉంది. ఒక దశలో ప్రయివేటుగా యూనివర్శిటీ పరీక్షలకు కడదామనుకున్నాడు. కాని ఆగిపోయాడు. ఇప్పుడు తనకేం లోటు. తృప్తి అవసరం మనిషికి. ఆ తృప్తి అతనికి పుష్కలంగా ఉంది. వనజాక్షి – ఇప్పుడు ఈ వయసులో చదువు దేనికి? అన్నది. చదువుకోవడం కంటే మనిషికి సంస్కారం, సత్యసంధత, చిత్తశుద్ధి, నీతి నిజాయితీ అవసరం అనేది. సెప్టెంబర్ నెల. గోదావరికి వరదలు. నీరు ఎర్రగా మడ్డిలా వుంటుంది. ఆ గోదావరిలో శవమై తేలింది వనజాక్షి. చచ్చిపోయినట్టు లేదు. ఈదుతున్నట్టు వుంది. ధ్యానంలో నిమగ్నమై కన్నులు మూసుకున్నట్టుంది. రాత్రి ఏ మూడు గంటలకో జరిగి ఉంటుంది దుర్ఘటన. సూర్యోదయానికి ముందే ఇవతలికి తీశారు. చుట్టూ జనం, పోలీసులు, పత్రికలవారు, టీవీఛానళ్ళవారు. ఉదయం ఎనిమిది గంటలకే లైవ్ టెలికాస్ట్. అందాలరాశి వనజాక్షి– అంతేకాదు – సద్గుణాల రాశి వనజాక్షి. నీటిమీద తేలుతున్న తామరపువ్వులా వుంది, వనజాక్షి – పద్మాక్షి –నీరజాక్షి! నీళ్ళమీద తేలే తాజా పువ్వులా వుంది. శవంలా లేదు. తల్లి గోదారమ్మ తన కడుపులో దాచుకుంది. అంతా కళ్ళకు కట్టినట్టే వుంది వీరాచారికి!

ఇంతలో అవును ఇంతలోనే పేపర్లన్నీ టీవీఛానళ్ళన్నీ గగ్గోలు. భార్గవి – సినీనటి భార్గవి మరణం. మగవాళ్ళు దుర్మార్గులు. ప్రేమకాదు – కామం, మోహం, వాంఛ – కాదు కాదు, స్వంత ఆస్తిభావం. వచ్చి స్వార్థం. ఈ చొక్కానాది, ఈ వస్తువు నాది అన్నట్టు ఆమె నాది. నాదంటే నాదీ అంటారు. ఆమెకీ కోరికలుండవా? అభిరుచులుండవా, ఇష్టాయిష్టాలుండ కూడదా?

సువర్ణ తండ్రి వాళ్ళో


**చదవండి!** **చదివించండి!** **చందాదారులు కండి!**

**గోదావరి తరంగాలు/సినీ** మాసపత్రిక

| | | | | |
|---|---|---|---|---|
| సంవత్సర చందా | (వ్యక్తులకు) | : | రూ. | 120/- |
| సంవత్సర చందా | (సంస్థలకు) | : | రూ. | 150/- |
| 3 సంవత్సరాల చందా | (వ్యక్తులకు) | : | రూ. | 330/- |
| 3 సంవత్సర చందా | (సంస్థలకు) | : | రూ. | 420/- |
| 5 సంవత్సరాల చందా | | : | రూ. | 500/- |
| 10 సంవత్సరాల చందా | | : | రూ. | 1,000/- |
| విశిష్ట సభ్యత్వం | | : | రూ. | 3,000/- |
| U.S.A | | : | | 25$ |

కూచుంది. నిన్న మొన్న మూడేళ్ళు నిండాయి. ముమ్మూర్తులా తల్లే. మూడేళ్ళ వనజాక్షి తన ఒళ్ళో కూచున్నట్లే వుంది. ఆమెని ముందు ముందు ఎలా పెంచాలో ఆలోచించుకుంటున్నాడు వీరాచారి. సాధ్యమైనా? లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా? నిజమే. సువర్ణ వికసిస్తున్న మొగ్గలా వుంది. నిజమే. సువర్ణ ఉదయిస్తున్న బాల భానునిలా వుంది. చంద్ర కిరణంలా వుంది. బంగారు తీగలా వుంది. వెండి బెత్తంలా వుంది. వజ్రపు తునకలా వుంది. రత్నాల రాశిలా వుంది. నిజమే. అవును నిజమే. సువర్ణ బాల వనజాక్షిలా వుంది. పాలుకారే వరికంకిలా వుంది.

వనజాక్షి తల్లి, తండ్రి – సువర్ణ తండ్రి వీరాచారి అందరికీ ఆ చిన్నారి ప్రాణమే. అయితే మరి ముద్దు చెయ్యకూడదు. అల్లారు ముద్దుగా పెంచితే ఆకతాయిగా తయారవుతారు. రాలుగాయి పాపల్లా మారిపోతారు. వీరాచారికి అంతా తెలుసు. అతని వయసు బొటాబొటీ ముప్ఫయి రెండు. ఆరేళ్ళ వైవాహిక జీవితం విషాదాంతమైపోయింది. పెద్ద వయసేం మించిపోలేదనీ, మళ్ళీ పెళ్ళి చేసుకోమనీ, తల్లి లేనిపిల్లని చూసుకోవడానికైనా ఒక తల్లిని చేసుకోమనీ బంధువర్గంలోని శ్రేయోభిలాషులు సలహాలివ్వడం ప్రారంభించారు. తన కూతురికి తల్లి – తనకి భార్య కదా. మరి ఆ భార్య తన కడుపు పండాలనుకుంటుంది గదా, తనకీ వేవిళ్ళు కావాలి. కడుపులో నలుసు పడాలి. బరువుగా నడవాలి. బిడ్డని ప్రసవించాలి. అది కష్టమా – అది బాధా. అవును కష్టమే. బాధే మరి బాధే. ఐతేనేం గాక అదే కావాలి. అద్ది గది కావాలి. అంటుంది. అనక తప్పదు. అది సహజం. అప్పుడు ఆమెతో మనసు లేకుండా కాపురం చేసినా కడుపు రాకుండా పోదు. ఒకవేళ ఒకవేల సుమండి – మనసులే కలిసినా, కడుపు మాత్రం మనసుకి కాదు, మనిషికి – ఆడ మనిషికి వస్తుంది. మరి వస్తే మనసు ఎల్లప్పుడు ఒకలా వుండదు, రోజూ ఉదయించే సూర్యచంద్రులే అయినా, గతులు తప్పకపోయినా ఆలోచనలు మారతాయి. అప్పుడు కడుపున బిడ్డని చూసుకోకుండా ఎవరినో – ఎవరినో కాదు, తన మొగుడి మొదటి పెళ్ళాం కూతుర్ని చూసుకోమనడం సాధ్యమా? రేపు నా బిడ్డ సంక్షేమం? నువ్వు బిడ్డల్ని కనడానికి వల్లకాదంటే ఏం చెయ్యాలి. ఒకవేళ ముందే అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని – ముందే ఆపరేషన్ చేయించుకు కూచుంటే ఏం దారీ? గోదారే? మాట్లాడుకొచ్చిన ఒకానొక పెళ్ళి కూతురుకి ఈ ప్రశ్నలన్నీ వచ్చాయి. వనజాక్షి కూతురి పెంపకం కోసం తాను వనవాసంలో సీతలా గడపాలా? కర్ణుణ్ణి కన్న కుంతిలా తయారవ్వాలా? మానసపుత్రులు కలగడానికి తాను ఏసును కన్న మరియమ్మ కాలేదు గదా. ఈ ప్రశ్నలు వీరాచారికి తట్టకపోలేదు. దైవభీతి పాపభీతికంటే కన్న కడుపు బలమైనది. దానికి అతీతులు వుండరు.

ఆదిలో తన అల్లుడు – మనవరాలి పెంపకం కోసం రెండోపెళ్ళి చేసుకుంటే ఎలా వుంటుందీ ఆలోచించాడు గాని – వరదరాజు – ఆ దరిమిలా ఆ ఆలోచన విరమించుకున్నాడు. వద్దు అనేశాడు.

వీరాచారి ప్రస్తుతానికి పెళ్ళి ఆలోచనలో లేదు. రేపు 2009 జనవరి 6 నాటికి – వనజాక్షి మరణించి నాలుగు నెలలవుతుంది. అంటే 120 రోజులు. ఇంతలోనే కొత్త పెళ్ళాం ఆయన అతనికి ఎందుకో న్యాయం కాదనిపించింది. చచ్చిపోయిన వాళ్ళు చచ్చిపోయారట. వాళ్ళ ఆత్మ తిరుగుతూనే వుంటుందిట. అలా పన్నెండేళ్ళు తిరుగుతుందట. అందుకే కనీసం పన్నెండేళ్ళు తద్దినాలు తప్పక పెట్టాలట. ఆ తరువాత మానెయ్యవచ్చా అనడిగితే అది వేరే కథ! వీరాచారికి ఆత్మలమీద అంతగా నమ్మకం లేదు. కానయితే మరణించినవాళ్ళ జ్ఞాపకాలు సన్నిహితుల మనస్సులో పచ్చిగా వుంటాయి. వాళ్ళే తరచు కలలో కొస్తుంటారు. వాళ్ళ మరణం అబద్ధంలా వుంటుంది.

ఇప్పటికీ వనజాక్షి వీరాచారి కలల్లోకి వస్తుంటుంది. పక్కనే కూచున్నట్టుంటుంది. వాటేసుకుని పడుకున్నట్టుంటుంది. హాయిగా మనసారా నవ్వుతూ మాట్లాడుతున్నట్టుంటుంది. ఆడవాళ్ళు చచ్చిపోకూడదు. అందునా కనీ పెంచే ముత్తయిదువు-వాళ్ళు పేరంటాళ్ళవుతారా. బెజవాడ కనకదుర్గమ్మ మొదట్లో అలాంటి పేరంటాలేనట.

వీరాచారి పెద్దగా చదువుకున్నవాడు కాదు. తీరుబడిగా వుంటే నానా ఆలోచనలు వస్తాయనీ ఎప్పుడూ ఏదో పనిలో మునిగి ఉంటాడు. ఎర్రని మడ్డిలాంటి నురగలు కట్టే వరద గోదాట్లో వనజాక్షి శవం ఇంకా కళ్ళకి కట్టినట్టే వుంది. శవంగా కాదు. మామూలు మనిషిలాగే వుంది.

వనజాక్షికి మరణం లేదు. కొందరి జీవితాల్లో మరణం కేవలం ఒక మజిలీ మాత్రమే. ఐనా వనజాక్షి చచ్చిపోయిందని ఎవరు చెప్పారు? పట్టుమని పదేళ్ళు గడవనివ్వండి వనజాక్షి మీ కళ్ళకెదురుగా మసల్తుంది. వికసించిన పద్మంలా పకపక నవ్వుతుంది. బాల సూర్యుడిలా వెలుగులు వెదజల్లుతుంది. వీరాచారి తృప్తిగా, మనసునిండా నవ్వుకున్నాడు. కాళ్ళకి వెండిపట్టీలతో గలగల లాడుతూ సువర్ణ బాల్యంలాగా ప్రవహిస్తుంది. ఈనాటి మొగ్గే రేపటి పువ్వు! పరిమళాలు వెదజల్లదూ..?

## నానీలు

## అసంపూర్ణ చిత్రాలు

ఎంత ఎండ కురిసినా
లోయల లోతుల్ని తడపలేనట్లే
ఎన్ని మాటల్ని గుప్పిస్తున్నా
కొంత విషయం
గుండెల్లో దాగే ఉంటుంది

కటిక చీకట్లో
ఎంత అడ్డుపెట్టినా
వేళ్ల సందుల్లోంచి తప్పించుకునే
కాంతిపుంజంలా
పెదవుల బిగింపు మధ్యనుంచి
కొంత రహస్యమైనా
వెదజల్లబడుతూనే ఉంటుంది

ఎవరి జీవితమూ
అగమ్యగోచరం కాదు
బాగా తెలిసిన పదాల మధ్య
ఎప్పుడూ దారి తప్పుతూనే ఉంటాం

ఎవరి జీవితమూ
అగమ్య గోచరం కాదు
గజిబిజి గీతల మధ్యనుంచి
రహస్యమార్గాలు
దారిచూపుతూనే ఉంటాయి

సంఘటనలను సాగదీసి
రెండు కొసలు కలిపి
ముడివేసినంత మాత్రాన
వృత్తం పూర్తయినట్టుకాదు

రోజుల పరిచయమైనా
ఏళ్ళ తరబడి సాన్నిహిత్యమైనా
అస్పష్ట రేఖల్నే మిగులుస్తున్నపుడు
ఊహాశక్తి
పూర్ణచిత్రాల్ని ఆవిష్కరింపజాలదు.

– కాశీభట్ల శశికాంత్